క్లుప్తంగా

'ఇస్రో' సెమినార్‌లో పాల్గొనండి..

సింగరేణి(కొత్తగూడెం): ఇస్రో ఆర్యభట్ట స్వర్ణోత్సవం ఆన్‌లైన్ సెమినార్‌లో విద్యార్థులు పాల్గొనాలని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశ మొట్టమొదటి శాటిలైట్ ఆర్యభట్ట ప్రయోగించి 50 వసంతాలు పూర్తవుతున్న (స్వర్ణోత్సవం) సందర్భంగా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఈనెల 19న నిర్వహిస్తున్న సెమినార్‌లో పాల్గొనాలని కోరారు. ***www.aryanhata.indiarpa ceweek.orf*** వెబ్‌సైట్‌లో ఈనెల 17 లోపల రిజిస్ట్రేషన్ చేసకోవాని పాల్గొనాలని, వివిధ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాటం

పాల్వంచ: భారతదేశంలో కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో హమాలీ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ కుల వ్యవస్థ నానాటికీ పెరుగుతుండడం బాధాకరం అన్నారు. శ్రమదోపిడీ, కుల వ్యవస్థ అంతానికై ఈనెల 14వ తేదీ వరకు జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కె.సత్య, ఈ.రాములు, వీర్లక్ష గట్టయ్య, రాజు, సంతోష్, సదానంద్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

27న చలో వరంగల్

పాల్వంచరూరల్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సందర్భంగా ఈనెల 27వ తేదిన జరపతలపెట్టిన సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు నాయకత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని నాయకులు కిలారు నాగేశ్వరరావు, వనమా రాఘవేంద్ర రావు కోరారు. పాతపాల్వంచలోని వనమా నివాసంలో శనివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వరంగల్ సభను విజయవంతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. మాజీ ఎంపీపీలు బాదావత్ శాంతి, మడివి సరస్వతి, భూక్యా సోనా, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ వేల్పుల దామోదర్, పట్టణ అధ్యక్షుడు ఎం.రాజుగౌడ్, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్, మండల అధ్యక్షుడు విశ్వనాథం పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

ఇల్లెందు: ఈ నెల 14న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఇల్లెందు ఏరియా జీఎం వి.కృష్ణయ్య అధికారులను కోరారు. శనివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. జేకే బస్టాఫ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రౌండ్‌లో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉద్యోగులు అత్యధికంగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అధికారులు నరసింహరాజు, జీవీ మోహన్ రావు, నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

సంత.. ట్రాఫిక్ జామ్



రోడ్డుపై సంతలో వినియోగదారులు

టేకులపల్లి: టేకులపల్లి రామాలయం వద్ద ప్రధాన రహదారి పక్కనే ప్రతీ శనివారం వార సంత నిర్వహిస్తారు. అసలే ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి. అధిక సంఖ్యలో చిన్న పెద్ద వాహనాల రాకపోకలు నిత్యం సాగుతుంటాయి. ఈ క్రమంలో సంతలో వ్యాపారాలు రోడ్డుకి దగ్గరగా ఉండటం, కొనుగోలు కోసం వచ్చే వారు ఆటోలు, ద్విచక్ర వాహనాలను రోడ్డు పక్కనే పెడుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇటు సంత నిర్వాహకులు, పంచాయతీ అధికారులు, పోలీసులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రతీ వారం ట్రాఫిక్ ఇబ్బందులతో వ్యాపారులు, కొనుదారులు, వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి ట్రాఫిక్‌కి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంతకు వచ్చిన పలువురు కోరుతున్నారు.



సంత వద్ద ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు



గణేష్ టెంపుల్ ఏరియా దుకాణంలో ఈఎంఐ వివరాలు తెలుసుకుంటున్న వినియోగదారులు



లక్ష్మీదేవిపల్లిలోని ఫ్రిజ్, ఏసీ, కూలర్ల షాపు



కొత్తగూడెం బస్టాండ్ వద్ద ఏసీల దుకాణం

వేసవిలో కూల్ కూల్‌గా..

- పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- జోరుగా కూలర్లు, ఏసీ, ఫ్రిజ్‌ల అమ్మకాలు
- ప్రతీ ఏడాది పెరుగుతున్న ధరలు..
- ఈఎంఐల సౌకర్యం కల్పిస్తూ అమ్మకాలు



సూపర్‌బజార్‌లోని ఓ షాపులో ఏసీలు పరిశీలిస్తున్న వినియోగదారులు

సండే స్పెషల్

కొత్తగూడెంఅర్బన్: ఈ ఏడాది మార్చి నెల ప్రారంభం నుంచి ఎండలు దంచికొడుతున్నాయి. కొత్తగూడెం సింగరేణి బొగ్గు ప్రాంతం కాబట్టి మరింత ఎక్కువగా ఉంటున్నాయి. దీని వలన పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోత, వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి మొదలవుతూ, సాయంత్రం 5 గంటల వరకు వేడి తగ్గడం లేదు. 15 రోజులుగా కొత్తగూడెంలో 40 డిగ్రీల నుంచి ఆపైన ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 11 నుంచి 12 గంటల లోపే ఏవైనా పనులుంటే చూసుకొని ఇళ్లకు చేరాలని, లేకుంటే ఎండలకు బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచనలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందంటున్నారు. మరోవైపు అప్రకటిత విద్యుత్ కోతలు కారణంగా ఇళ్లలోని ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసలే వేడి ఆపైన కరెంటు కోతలు, అదీ అర్ధ రాత్రి, తెల్లవారుజామున ఇష్టానుసారంగా కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వేడి, ఉక్కపోతలనుంచి ఉపశమనం పొందేందుకు ప్రతీ ఇంట్లో కూలర్లు, ఏసీలను వినియోగించే పరిస్థితులు ఏర్పడ్డాయి. పాత ఏసీలు, కూలర్లు చిన్నచిన్న రిపేర్లు చేయించుకొని వినియోగిస్తున్నారు. మరికొంత మంది కొత్తవి కొనుగోలు చేయడానికే ఇష్టపడుతున్నారు. దీంతో నెల రోజులుగా ఏసీలు, కూలర్లు షాపులు కొనుగోలుదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం విద్యుత్ సబ్సిడీ కూడా ఉండడం వలన కూలర్లు, ఏసీ, ఫ్రిజ్‌లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. సబ్సిడీ విద్యుత్ రీడింగ్ కన్నా మించితే బిల్లు మరింత ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుంది. బిల్లు వచ్చినా సరే.. ప్రస్తుత వాతావరణాన్ని బట్టి ఇల్లంతా కూల్‌గా ఉండే విధంగా చూసుకుంటున్నారు. అయితే గ్యారంటీల కన్నా కూడా ప్రతీ ఏడాది ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల ధరలు పెంచి అమ్మకాలు చేస్తుండడంతో ప్రజలకు భారంగా మారింది. మార్కెట్‌లో బ్రాండెడ్ కంపెనీల కూలర్లకు ఏడాది, రెండేళ్లు వారెంట్ ఉంటుంది. కానీ కొంతమంది విజయవాడ, హైదరాబాద్, రాజస్థాన్ వంటి ప్రాంతాల నుంచి అసెంబుల్డ్ కూలర్లను తెచ్చి అమ్ముతున్నారు. వాటికి అయితే నో గ్యారంటీ. తీసుకెళ్లిన గంటలో మరమ్మతులకు గురి అయినా వారి బాధ్యత కాదని చెప్పి మరీ అమ్ముతున్నారు వ్యాపారులు. అయినా ధర తక్కువ అని ప్రజలు వాటినే కొనుగోలు చేస్తున్నారు.

ఆకర్షణీయమైన మోడళ్లు..

కొత్తగూడెంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం రాజస్థాన్ కూలర్లు, లోకల్ తయారీ కూలర్లు, వివిధ కంపెనీల కూలర్లు ఇలా అనేక రకాలుగా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. గతంలో కూలర్లకు మూడు వైపులా డోర్స్‌కు గడ్డిని ఏర్పాటు చేసి అమ్మకాలు చేసేవారు. ప్రస్తుతం గడ్డికి బదులుగా తడిచి ఎండిపోయే పేపర్‌ను ఏర్పాటు చేసి కొత్తగా అమ్మకాలు చేస్తున్నారు. కూలర్లు రూ. 5 వేల నుంచి రూ.10 వేలు ఆపైన రేట్లలో ఉన్నాయి. ఏసీలు అయితే ధరను బట్టి రూమ్‌ను కూల్‌గా ఉంచేవి లభ్యం అవుతున్నాయి. వీటిల్లో కూడా అనేక కంపెనీలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఏసీలు ప్రముఖ కంపెనీలకు చెందినవి అయితే రూ.40 వేల మొదలు నుంచి లభ్యం అవుతున్నాయి. ఇక ఫ్రిజ్‌లు రూ.15 వేలు, కూలర్లు రూ.10 వేల నుంచి, లోకల్ తయారీ కూలర్లు రూ.5 వేల నుంచి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

కొత్తగూడెం మార్కెట్‌లోకి కార్పొరేట్ కంపెనీలకు చెందిన ఎలక్ట్రికల్ పరికరాల షోరూంలు రావడంతో చిరువ్యాపారాలు అమ్మకాలు సరిగా లేక అవస్థలు పడుతున్నారు. అన్నివర్గాల వారు అద్దాలల్లో ఆకర్షణీయంగా కనిపించే షోరూంలకు వెళ్లి కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారని, దీని వలన చిన్న వ్యాపారులు నష్టపోతున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ప్రజలు నాణ్యత, గ్యారంటీ, కంపెనీ తదితర విషయాలను గమనించి కొనుగోలు చేస్తే ఎక్కువ రోజులు ఉపయోగించుకోవచ్చని చెబుతున్నారు.

ధరలు పెరిగాయి..



గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఫ్రిజ్‌లు, కూలర్ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఏ స్థాయికి తగ్గట్టుగా వారు కూలర్లు, ఏసీలు వాడుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఖర్చును సైతం ఎవరూ లెక్క చేయడం లేదు. ప్రస్తుతం అన్నీ కంపెనీలకు ఈఎంఐలు అందుబాటులో ఉండడం వలన అన్నివర్గాల వారు కొనుగోలు చేస్తున్నారు.

– బి.రాంబాబు, ఆళ్లపల్లి

అమ్మకాలు బాగున్నాయి..



కొత్తగూడెంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో అమ్మకాలు జోరందుకుంది. వివిధ కంపెనీలకు చెందిన కూలర్లతో పాటుగా ఏసీలను కూడా వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అన్నివర్గాలకు ప్రజలకు కంపెనీలను బట్టి ధరలు అందుబాటులో ఉంచి అమ్మకాలు చేస్తున్నాం. ఈ సంవత్సరం వేసవిలో మరింత ఎక్కువ వేడి ఉంటోంది.

– చంద్రకిరణ్, ఎగ్జిక్యూటివ్

రాజ్యాంగ స్ఫూర్తికి బీజేపీ అడ్డుకట్ట



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పాల్వంచ: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని విఘాతం కలిగించే విధంగా పాలన సాగిస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం.. దేశాన్ని రక్షించుకుందాం.. నినాదంతో భగతసింగ్ వర్ధంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు శనివారం సీపీఐ ఆధ్వర్యంలో కేఎస్‌పీ రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. విశ్వనాథం మాట్లాడుతూ.. పాలకులు కులాన్ని, మతాన్ని వాడుకుంటూ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ పాలనను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, ఉపేంద్రాచారి, వైఎస్ గిరి, వేముల శ్రీను, రెహమాన్, బీవీ సత్యనారాయణ, కోరె కృష్ణ, కాసర్ల రామారావు, అజిత్, బిక్కులాల్, కొంగల అప్పారావు, అమృతరావు, ఆదినారాయణ, క్రాంతి, పర్వీన్ పాల్గొన్నారు.

నేటి సమావేశాన్ని విజయవంతం చేయండి..

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని ప్రకాశం మైదానంలో ఆదివారం జిల్లా కూంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ల సమావేశం జరగనుందని విజయవంతం చేయాలని సీనియర్ మాస్టర్లు ఐ.ఆదినారాయణ, కాశీ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్‌ను అభివృద్ధి చేసేందుకు, జిల్లాలో కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దడానికి చేపట్టవలసిన అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.

పక్షం రోజులకే పగుళ్లు



నరసింహా స్వామి ఆలయం వద్ద పగిలిపోయిన రోడ్డు, సంగం గట్టు గ్రామం వద్ద..

పాల్వంచరూరల్: 15 రోజుల క్రితం నిర్మాణం చేసిన సిమెంట్ రోడ్డు నాణ్యతా లోపంతో పగిలిపోయాయి. సంగం నుంచి సంగం గట్టు వరకు రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును అస్తవ్యస్తంగా నిర్మించారు. దీనికి తోడు ఉపాధి హామి పథకం కింద రూ.5లక్షల ఖర్చుతో నరసింహా స్వామి ఆలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డు సరైన క్యూరింగ్ చేయకపోవడం వలన రోడ్డు పగిలిపోయింది. నాసిరకంగా నిర్మించిన సీసీ రోడ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వంట గదికి మరమ్మతులు

టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలోని వంట గది స్లాబ్ పెచ్చులు ఊడి వంట మనిషికి గాయమైన సంఘటన శుక్రవారం జరిగిన విషయం తెలిసిందే. శనివారం డీఈ నాగేశ్వరచారి, ఏఈ యూసుఫ్, ఎంఈఓ జగన్ నాయక్ బొమ్మనపల్లి పాఠశాల వంట గదిని పరిశీలించారు. గది శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండటంతో స్పందించిన అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. వెంటనే మరమ్మతు పనులను ప్రారంభించారు.

పల్లెల్లో సీపీఎం అధ్యయన యాత్ర

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో నెలకొన్న సమస్యలపై సీపీఎం నేతలు శనివారం అధ్యయన యాత్ర నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన పూబెల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణ తీరును పరిశీలించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రత్యేక పర్యటనలో అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షలు సరిపోవని, కేంద్ర ప్రభుత్వ ఆవాస్ యోజన పథకాన్ని వర్తింపజేసి రూ.15లక్షలు మంజూరు చేయాలని కోరారు. లబ్ధిదారులంతా నిరుపేదలైనందున ముందే సగం బిల్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాత్రలో గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, వజ్జ సురేష్, కొడెం బోస్, అబ్బాస్, నాగరాజు, మమత, సోమ కృష్ణ పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2008-2012 బ్యాచ్ ఇంజనీరింగ్ విద్యార్థులు

పాల్వంచ: స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కళాశాలలో తొలి ఇంజనీరింగ్ బ్యాచ్ 2008–2012 విద్యార్థులంతా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ టి.భరత్ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి, సెక్రటరీ డాక్టర్ టి.అవని, అకడమిక్ డైరెక్టర్ ఎన్వీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న పువాళ్ల దుర్గాప్రసాద్, పక్కన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాలతో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరై మాట్లాడారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని, భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లను బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాల్గొనలేదని, అలాంటిది ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా అవహేళన చేస్తున్నారని విమర్శించారు. మోదీ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి వెనక్కి తగ్గిందన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిధులు, నీళ్లు, నియామకాలు వస్తాయని ప్రజలు అనుకుంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్ రాథోడ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులందరూ భేతాళపాడు గ్రామ పంచాయతీ రేగళ్లతండాకు చెందిన భూక్యా మహేష్ ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం తిన్నారు. ప్రభుత్వ పథకాలపై స్థానికలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సౌజన్య, మాలోత్ మంగీలాల్ నాయక్, ఏనుగుల అర్జున్‌రావు, వడ్డె నారాయణ, దొండపాటి శ్రీనివాసరావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, రోకటి సురేష్, బానోత్ లాలు నాయక్, నున్నా రంగారావు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ దరఖాస్తుల స్వీకరణ

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఆర్థిక అభ్యున్నతికి ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను సెలవురోజులు 12,13,14 తేదీల్లో స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 947 మంది దరఖాస్తు చేసుకున్నారని, మరో రెండు రోజులు గడువు ఉందని పేర్కొన్నారు.

గడువు పెంచాలి...

సింగరేణి(కొత్తగూడెం): 12,13,14వ తేదీలో సెలవులను దృష్టిలో ఉంచుకొని రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని సీపీఐ నాయకుడు మునిగడప వెంకటేశ్వర్లు కోరారు. పదో వార్డులో శనివారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మూడు రోజులు ఆన్‌లైన్ పని చేయదని అధికారులు స్పందించాలని కోరారు.

కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలనపై అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. సుభాష్‌నగర్ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన పార్టీ మండల, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె ప్రసంగించారు. రైతు రుణమాఫీ సగం మందికి కూడా వర్తింపజేయలేదని, రైతు భరోసా అరకొరగా అమలు చేస్తూ మోసం చేశారని ఆరోపించారు. కనీసం గతంలో బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను కూడా అమలు చేయలేని అసమర్థతతో పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని నడిపించేందుకు అంటూ భూములను విక్రయించడం, అప్పులు చేయడం మినహా ఏడాదిలో ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ము కాంగ్రెస్‌కు లేదని ఆరోపించారు. గతంలో సీఎంగా కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గానికి మంజూరు చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని, కొత్తగా ఇల్లెందుకు తెచ్చిన నిధులు శూన్యమన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎలకతుర్తిలో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించాలని, ప్రతీ పంచాయతీలో గద్దె కట్టి పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. సమావేశంలో దిండిగల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, పర్సూరి వెంకటేశ్వరరావు, ఎస్.రంగనాథ్, ప్రమోద్, ఘాజీ, నెమలి ధనలక్ష్మి, నబీ, పూనెం కమల, వల్లాల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి



మాట్లాడున్న ఫహీందాదా

సూపర్‌బజార్(కొత్తగూడెం): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రామవరంలో ముస్లింలు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు ఫహీందాదా మాట్లాడుతూ... భిన్న సంస్కృతులు, భిన్న జాతులు, భాషలు, మతాలతో 147 కోట్ల భారతీయులను ఒక పార్టీపైకి తెచ్చిన మన రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ కేంద్రంలో బీజేపీ పాలన సాగుతోందని విమర్శించారు. పార్లమెంట్‌లో ఉన్న బలంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర సర్కార్‌పై తిరగబడితేనే ప్రజాస్వామ్యం రక్షించబడుతుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం పెద్దలు దానం చేసిన స్థలాలు వక్ఫ్ బోర్డుకు చెందకుండా చేయాలనే కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు.

ఒక మతానికి సంబంధించిన బోర్డులో ఇష్టానుసారంగా సవరణ చేయడం సరైంది కాదన్నారు. 370 యాక్ట్ ట్రిపుల్ తలాక్, ఇజాబ్ వంటి మరెన్నో కుట్రపూరితంగా బీజేపీ ముస్లింలపై విషం చల్లుతోందన్నారు. దేశంలో అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఖయ్యూం, జమీల్, జలీల్, జానీ, రసూల్, సలీం, అజీమ్, అర్జున్, అన్వర్, బాజీ, అమాన్, భాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

జూలూరుపాడు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు బానోత్ మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో మాట్లాడుతూ... ఇందిరమ్మ గ్రామ కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా మారాయన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారని, కానీ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రక్రియ సక్రమంగా కొనసాగడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అరులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

హనుమాన్ విజయోత్సవ పూజలు



సుభాష్‌నగర్‌లో పూజ చేస్తున్న భక్తులు



కొత్తగూడెంలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఇల్లెందు: వీహెచ్‌పీ– భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శ్రీ వీరహనుమాన్ విజయ శోభాయాత్రను శనివారం ఇల్లెందులో ఘనంగా నిర్వహించారు. నాయకులు రాములోనియా, అజయ్ పాసీ మాట్లాడుతూ.. హనుమంతుడు లంకను దాటి సీతామాత జాడ కనుగొని లంకా దహనం చేసి విజయంతో సీతమ్మను రాముడు వద్దకు చేర్చిన రోజే ఈ విజయ శోభాయాత్ర జరిగిన రోజు అన్నారు. ఈ రోజు విశిష్టతను ప్రతీ హిందువు ఈ దేశానికి చాటి చెప్పేలా ముందుకు రావాలని కోరారు. ఈ శోభాయాత్రలో వేముల రాజేశ్వరరావు, కీర్తి ప్రసాద్, అజయ్‌పాసీ, జానకీరామ్, ఉపేంద్రనాత్, డీకే శ్రీనివాస్, శివమ్ ఠాకూర్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమ విజయోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. సుభాష్‌నగర్ కోదండ రామాలయంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠించారు.

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని హనుమాన్ ఆలయాల్లో హనుమ విజయోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు జై హనుమాన్ నినాదాలతో మార్మోగాయి. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. మెరుగు చింటేశ్వర్, కూసన సాగర్, మహేష్ జాజూ, ముచ్చకిర్తి కిరణ్, శైలేందర్, సాహూ జైన్ తదితరులు పాల్గొన్నారు.